

# మాయమయిపోయిన నక్షత్రాలు *

కూర్మా వేణుగోపాలస్వామి,
శేషుబాయి గోపాలస్వామి

"సార్" అన్నాడు మా నౌకరు, నేను వ్రాస్తోన్న పద్యంలో రెండో చరణం పూర్తి చేస్తోండగా "ఇద్దరు దేవతలు మీతో మాట్లాడ్డానికి వచ్చి గుమ్మంలో ఉన్నారు సార్."

"ఏవీ, విసిటింగు కార్డులు ఇచ్చారా?" అని నేనడిగా.

"ఇవిగోండి సార్."

ఒకదానిమీద 'హేలియల్' అనిన్నీ, ఇంకో దానిమీద 'జేఫెయిల్' అనిన్నీ ఉండగా చదివాను. ఇద్దరూ దేవతలే. అనుమానం ఏమీ లేదు

"సరే వాళ్లను లోపలకు రమ్మను" అన్నా నేను

అంతటి గొప్పవాళ్లు నన్ను చూడ్డానికి వచ్చినప్పుడు వాళ్లని ఆదరించడం నాకు సంతోషం ఇవ్వాక పోలేదు వాళ్లు పెద్ద రెక్కలు ధరించారు ఒకొక్క రెక్కకు ఏడేసి ఈక లున్నాయి వాట్లమీద ఉండే మెత్తటి బొచ్చులోంచి ఇంద్రధనుస్సులో ఉండే ఏడు రంగులూ తెల్లవారుజామునవచ్చే మంచుపొగలాగ తళ తళ మెరుస్తోన్నాయి వారి శరీరాలు, కనబడినంతవరకూ, స్వచ్ఛమైన మంచుతో కొంచెం గులాబీరంగు కలిపినట్లున్నాయి వారిని కూర్చోమని చేతిని ఊపుతో ప్రార్థిస్తో నాకీ పరిచయం కలుగచేసి గౌరవపరచడానికి కారణమేమని వినయంగా అడిగా

"క్లుప్తంగా చెప్తాం" అన్నాడు హేలియల్ "పదహారు సంవత్సరాల క్రిందట జూలై నెల్లో ఒక చక్కని రాత్రి మేము బిలియర్డ్సు ఆడుకొంటున్నాం, జేఫెయిలున్నూ నేనున్నూ, పచ్చని తివాసీ యగు ఆకాశంమీద."

"క్షమించండి" అని నే నడ్డం వచ్చా. "నేను ఆకాశం నీలివర్ణం అని అనుకున్నా."

"అంతటి విస్తీర్ణంలో కొన్ని చోట్ల నీలివర్ణమే, కాని యితర చోట్ల, ముఖ్యంగా పర్షియా దేశంలో ఉండే పట్నాలమీదా, బయలుప్రదేశాలమీదా అది కంటికి మిక్కిలి ఇంపైన చక్కని ఆకుపచ్చనివర్ణంగలది."

నే నేం జబాబు చెప్పలేదు

హేలియల్ తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు.

"మాకు కనబడ్డ నక్షత్రాల్లో మిక్కిలి అందమైనవాటిని బంతులుగా వాడాం"

"మరి బంతుల్ని కొట్టేకఱ్ఱలో?" అని నే నడిగా.

"తోకచుక్కల తోకలు కనుక నే సహజంగా, ఆ ఆట చాలా ముచ్చటగా ఉంది. నేను గెలువడానికి సిద్ధంగా ఉన్నా అప్పుడు ఒక పెద్దదెబ్బతో రెండు బంతులూ ఒడ్డుదాటిపొయ్యేటట్టు కొట్టేసాను"

"ఒడ్డు దాటిపొయ్యేటట్టా?"

---

* ఫ్రెంచ్ గ్రంథకర్త యగు కాతూల్ మెన్‌డీసునుండి తెనిగించబడ్డది.

"అవును. దిక్చక్రం ఒడ్డు. ఇట్లవడంవల్ల పెద్ద విపత్తు వచ్చింది. ఎందుకంటే స్వర్గంలో రెండు నక్షత్రాలు తక్కువ అవడం చాలా ఆందోళన గలిగించేవిషయం అని మీరు తెలిసే ఉండవచ్చు. మే మా నక్షత్రాల్ని వెదికి తెచ్చి వాటిస్థలాల్లో ఎప్పట్లాగ తిరిగి పెట్టేసే వరకూ, స్వర్గంలో ఉండే ఆనందాన్ని పాల్గొనడానికి వీల్లేదని స్వర్గాధిపతి మమ్మల్ని ఆజ్ఞాపించాడు.

"మేము ఈ పదహారేళ్లనుంచి, భూమికి పైన క్రింద, నక్షత్రాలు సాధారణంగా పడేచోట్లంతా ఎంత వెదికామో మీరే ఆలోచించుకోవచ్చు. కాని మా అన్వేషణా లన్నీ వృధా అయిపోయ్యాయి.

"అనంతమైన దేశభ్రష్టతే మాకు గతి అని గుండె నిబ్బరం చేసుకోబోతున్నాం. అంతలో ఒకయువతి యొక్క అసమానమైన కండ్లను గురించి విన్నాం. ఆమె మీ ప్రియురాలట— దేశం అంతా వెల్లడి అయిన పుకారు నమ్మదగిందయితే. మామూలుగా మానవులకు ఉండే కండ్లకు బదులు మేము వెదికేనక్షత్రాలే ఆమెకు కండ్లుగా ఉన్నాయని అన్నివిధాల సూచించడం వల్ల ఆమె వాటిని తిరిగి ఇచ్చివేయడానికి ఇష్టపడుతుందని మేము అపేక్షిస్తోన్నాం."

ఈ మాటలు నన్ను విపరీతంగా కలవరపెట్టేశాయి. నాప్రియతరమైన ప్రియురాలి కండ్లు నాదగ్గర నుండి తీసుకుపోతోన్నారనే మాట వినేటప్పటికే నాకు చెప్పతరముకానటువంటి దిగులు పుట్టింది. ఇద్దరు దేవతలకు వాళ్ల దైవికమయినపిత్రార్జితం వాళ్లకి తిరిగి స్వాధీన పరచుకొనడంలో సాయంచేయడం నాచేతుల్లో ఉంది! నేను మెసాస్యీని పిలిపించి, ఆమెకు కొద్దిమాటల్లో ఈ విషయాన్ని స్పష్టపరిచా.

ఆమె ఆశ్చర్యపడ్డట్టుగాని, వ్యాకులత చెందినట్టుగాని కనబల్లేదు. కాని కొన్ని క్షణాలు ఆలోచించి, వచ్చినవాళ్ల వంక తిరిగింది. తిరిగి తనకండ్లరెప్పలు తెరవడానికి సాధ్యమయినంతవరకూ తెరచి, "చూడండి, ఓ చక్కని దేవతలారా, మీనక్షత్రాలని గుర్తుపట్టగలరేమో చెప్పండి." అని అంది.

వాళ్లు దగ్గరకువచ్చారు. మెసాస్యీనిర్మలమైన కళ్లను చాలా జాగ్రత్తగా పరీక్షచేసారు. కొన్నినిమిషాలు, న్యాయమూర్తులు తమఅభిప్రాయాలు మార్చుకునేటట్లు, ఒకళ్లతో ఒకళ్లు మెల్లగా సంభాషించారు. తర్వాత హేలియల్ అన్నాడు: "కాదు. పదహారేళ్లక్రిందట మాయమయిపోయిన నక్షత్రా లివి కావు. ఆ జూలైరాత్రి అవి ఎంతప్రకాశంగాఉండేవో అంతప్రకాశంగాఉన్నా, వాటికి ఈకాంతిగాని, ఈమెరుపుగాని లేదు."

అంతట వాళ్లు మిక్కిలి విచారిస్తూ వెళ్లిపొయ్యారు. అయితే నాప్రియురాల్ని వాళ్లు నాదగ్గర నుండి అపహరించలేదని సంతోషపడినప్పటికీ వాళ్లను చూచి మనఃపూర్తిగా జాలిపడ్డా.

ఇక మెసాస్యీయో? ఆమె కడుపుబ్బ నవ్వింది. "నేను వాళ్లను బాగా మోసం చేయలేదా" అన్నది. "వాళ్లు చెప్పింది నిజమే—నేను పుట్టిన కొద్దిరోజుల్లోపల కిటికీలు తెరచిఉంటే రెండు నక్షత్రాలు వచ్చి సరిగ్గా నాకనురెప్పల్లో పడ్డట్లు మాఅమ్మ నాకు ఒహ నూరుసార్లయినా చెప్పింది. అయితే ఆదేవతలు నన్ను పరీక్షించేటప్పుడు, మొదటిసారి మీరు నాపెదిమలమీద ముద్దును ముద్రించినప్పటి సంగతి తలుచుకున్నా. ఆ ఆనందాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే, ఇదివరకు పోయిన నక్షత్రాలైన నా కళ్లు ఆకాశంలో ఉన్న ప్రకాశతరమైన నక్షత్రాల కంటె ఎక్కువ కాంతివంతం అవుతా యని నాకు బాగా తెలుసు, ప్రియా."